AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
4-7-2026 (Saturday)
MAIN EDITION

## ఆస్పత్రిలో చేరిన ఏక్‌నాథ్ షిండే..




**అక్షరటుడే, ముంబై:** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే శనివారం థానేలోని జూపిటర్ ఆస్పత్రిలో చేరారు. ఆయన నిన్నటి నుంచి స్వల్ప జ్వరం, నీరసం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నట్లు తెలిసింది. ముందుజాగ్రత్త చర్యగా వైద్యుల సలహా మేరకు ఆయనను ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ ఆయన సాధారణ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వైద్యుల బృందం నిరంతరం ఆయనను పర్యవేక్షిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## తిరుమల అలిపిరి మెట్లెక్కిన 116 ఏళ్ల వృద్ధురాలు



**అక్షరటుడే, తిరుమల:** తిరుమల శ్రీవారిపై అచంచల భక్తితో 116 ఏళ్ల వయసులో ఓ వృద్ధురాలు కాలినడకన కొండ ఎక్కింది. కర్ణాటకకు చెందిన ఒక వృద్ధురాలు.. తన కుటుంబ సభ్యుల సహకారంతో 3550 మెట్ల కఠినమైన అలిపిరి మెట్ల ద్వారా కాలినడన తిరుమలకు చేరుకుంది. యువకులు సైతం ఆయాసపడే మెట్ల మార్గంలో ఆమె అలసట లేకుండా నడుస్తున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## టెలిగ్రామ్‌కు కేంద్రం నోటీసులు



అక్షరటుడే, ఢిల్లీ: పైరసీపై టెలిగ్రామ్‌కు భారత ప్రభుత్వం నోటీసు జారీ చేసింది. పైరసీ చిత్రాలు, ఓటీటీ కంటెంట్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని.. 15 రోజుల్లోగా కార్యాచరణ నివేదికను సమర్పించాలని ఆదేశించింది. చలనచిత్ర పరిశ్రమ, ప్రసారకర్తలు, ఓటీటీ ప్లాట్‌ఫాంలు, నిర్మాతలు, పంపిణీదారులను పరిరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

## విశాఖ గాజువాకలో ఉద్రిక్తత



అక్షరటుడే, విశాఖ: ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో గల గాజువాకలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. స్టీల్ ప్లాంట్ నిర్వాసితులు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో వంటా-వార్పు కార్యక్రమం చేపట్టగా పోలీసులు వారు అడ్డుకున్నారు. దీంతో వారు టీడీపీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ఆఫీస్‌ను ముట్టడించి నిరసన తెలిపారు.

## ఓటరు ఫారం సమర్పించిన ఉపరాష్ట్రపతి



అక్షరటుడే, ఢిల్లీ: ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఓటరు ఫారాన్ని సమర్పించారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ (ఎస్ఐఆర్)లో భాగంగా భారత ఉపరాష్ట్రపతి తన ఎన్యూమరేషన్ ఫారంను సమర్పించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పాల్గొని పౌరులందరికీ ఆయన స్ఫూర్తిగా నిలిచారు.

## తెలంగాణకు భారీ వర్ష సూచన



**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలో శనివారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈదురు గాలులు వీస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలంగాణలోని ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి, భూపాలపల్లి, కామారెడ్డి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతాయి. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురుస్తాయి. బలమైన అల్ప పీడన ప్రభావంతో 60 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీస్తాయి.




తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీకి కొత్త చిక్కులు వచ్చాయి. పార్టీ పేరు మార్చుకోవాలని ఎన్నికల సంఘం పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు లేఖ రాసింది. పార్టీ పేరుపై అభ్యంతరాలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. 15 రోజుల్లో మూడు ప్రత్యామ్నాయ పేర్లు ఇవ్వాలని పేర్కొంది. లేకపోతే దరఖాస్తును మూసి వేస్తామని ప్రకటించింది.

- అక్షరటుడే, హైదరాబాద్

# కవిత పార్టీకి షాక్..

■ పేరు మార్చుకోవాలని ఈసీ లేఖ ■ అభ్యంతరాలు రావడంతో నిర్ణయం ■ కొత్త పేర్లు ఇచ్చేది లేదన్న టీఆర్ఎస్ చీఫ్

బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన అనంతరం కొన్ని రోజులు జాగృతి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించిన కవిత.. అనంతరం సొంతంగా రాజకీయ పార్టీని ఏర్పాటు చేశారు. జాగృతి జనం బాటలో భాగంగా జిల్లాల్లో పర్యటించారు. అనంతరం ప్రజలు, అనుచరులతో చర్చించి కొత్త పార్టీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఏప్రిల్ 25న తన పార్టీ పేరు తెలంగాణ రాష్ట్ర సేన అని కవిత ప్రకటించారు. అయితే ఎన్నికల సంఘం తెలంగాణ రక్షణ సేనకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు పార్టీ పేరును తర్వాత సవరించారు.

### అభ్యంతరాలు రావడంతో..

కవిత పార్టీ పేరుపై అనేక అభ్యంతరాలు వచ్చాయి. ముఖ్యంగా టీఆర్ఎస్ అని ఉండటంతో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్ర సమితి అనంతరం భారత రాష్ట్ర సమితిగా మారిన విషయం తెలిసిందే. మళ్లీ టీఆర్ఎస్‌గా మార్చాలని ఆ పార్టీ నేతలు భావించారు. ఈ క్రమంలో ఆ పేరుకు దగ్గరగా ఉండేలా కవిత తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ఏర్పాటు చేశారు. దీంతో అనేక అభ్యంతరాలు వచ్చాయి. ఈ క్రమంలో ఎన్నికల సంఘం కవితకు లేఖ రాసింది. పార్టీ పేరు మార్చుకోవాలని స్పష్టం చేసింది. 15 రోజుల్లో మూడు ప్రత్యామ్నాయ పేర్లు ఇవ్వకపోతే పార్టీ దరఖాస్తును మూసివేస్తామని పేర్కొంది.

### న్యాయపోరాటానికి సిద్ధం

కవిత పార్టీ రిజిస్ట్రేషన్‌కు ప్రస్తుతం పేరు వివాదంతో అడ్డంకులు వచ్చాయి. కొత్త పేర్లతో మళ్లీ దరఖాస్తు చేయాలని ఈసీ సూచించింది. ఈ వ్యవహారంపై పార్టీ అధ్యక్షురాలు కవిత స్పందించారు. తమకు ఈసీ నుంచి వచ్చిన అభ్యంతరాలకు సమాధానం ఇచ్చామన్నారు. అయితే కొత్త పేర్లు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. ఈసీ తమ దరఖాస్తును మూసి వేస్తే న్యాయపోరాటానికే సిద్ధమని తెలిపారు. దీంతో పార్టీ రిజిస్ట్రేషన్ అవుతుందా.. లేదా అనే ఉత్కంఠ నెలకొంది.

## జెడ్పీటీసీ నుంచి సీఎం వరకు.. రేవంత్‌రెడ్డి 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానం




**అక్షరటుడే, హైదరాబాద్ :** సీఎం రేవంత్‌రెడ్డి తన రాజకీయ జీవితంలో 20 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఎమోషనల్ ట్వీట్ చేశారు. లక్షల అక్షరాలతో రాసినా.. కోట్ల పదాలను కూర్చి చెప్పినా.. తరగని మధుర జ్ఞాపకం ఈ రెండు దశాబ్దాల ప్రజా జీవితం అని పేర్కొన్నారు. మిడ్జిల్‌లో రేవంత్ రెడ్డిగా మొదలై.. నేడు అందరి గుండెల్లో "రేవంతన్న"గా నిలిచే వరకు సాగిన ఈ అద్భుత ప్రయాణం తన జీవితంలో ప్రత్యేక అధ్యాయం అని సీఎం పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదంతో భవిష్యత్తులో తెలంగాణ పునర్ నిర్మాణ శ్రామికుడిగా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సేవకుడిగా పని చేస్తానన్నారు.

## దేశంలో యూరియా ఉత్పత్తి పెంచాం : ప్రధాని మోదీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పశ్చిమాసియా సంక్షోభంతో యూరియా బస్తా ధర రూ.3 వేలకు పెరిగిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. అయినా దేశంలోని రైతులకు రూ.300 లోపే అందిస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ఇబ్బందులు లేకుండా దేశంలో యూరియా ఉత్పత్తి పెంచామన్నారు. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో కొత్త విమానాశ్రయ టెర్మినల్‌ను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో ఈ కొత్త టెర్మినల్ నిర్మాణం, ఇంటీరియర్ గురించి ఎంతగానో చర్చ జరుగుతోందన్నారు. రాజస్థాన్ సంస్కృతి ప్రతిచోటా కనిపిస్తుందని తెలిపారు. ఇది మార్వార్ ప్రాంతంలో పర్యాటకం, వాణిజ్యం, ఉపాధికి కొత్త ఊతాన్ని ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## 23 మందిని ఉగ్రవాదులుగా ప్రకటించిన కేంద్రం




**అక్షరటుడే, నేషనల్:** 'ఉపా' చట్టం కింద 23 మందిని కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులుగా ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ నోటిఫికేషన్‌లో జైష్‌ఎమహ్మద్ మరియు లష్కరే తోయిబాలతో సంబంధం ఉన్న పాకిస్థాన్‌కు చెందిన పలువురు ఉగ్రవాదుల పేర్లు ఉన్నాయి. ఈ వ్యక్తులు ఉగ్రవాద నియామకాలు, చొరబాటు, శిక్షణ, డ్రోన్‌ల ద్వారా ఆయుధాల సరఫరా, జమ్మూ కాశ్మీర్‌లో దాడుల ప్రణాళికలలో పాల్గొన్నారని ఆరోపణలున్నాయని హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. కేంద్ర ఉగ్రవాదులుగా ప్రకటించిన 23 మందిలో ముగ్గురు లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ మహమ్మద్ సయీద్‌కు సన్నిహితులని తెలుస్తోంది. ముగ్గురు 2016లో నగోటాలోని ఆర్మీ క్యాంప్‌పై జరిగిన ఉగ్రదాడిలో పాల్గొన్నారని భావిస్తున్నారు. ఇద్దరు 2018లో సుంజ్‌వాన్ మిలిటరీ స్టేషన్‌పై జరిగిన ఉగ్రదాడిలో పాల్గొన్నారని ఆరోపణలు ఉన్నాయి.

## జూలై 20 నుంచి పార్లమెంటు సమావేశాలు



**అక్షరటుడే, ఢిల్లీ:** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై 20 నుంచి ప్రారంభం కానున్నాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. సమావేశాలు ఆగస్టు 13 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. సమావేశాల్లో భాగంగా పలు కీలక బిల్లులు సభలో ప్రవేశపెట్టనున్నారు. అలాగే వివిధ అంశాలపై చర్చలు జరగనున్నాయి.

## ఆహార కల్తీపై హెచ్‌ఫాస్ట్ ఉక్కుపాదం..



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్‌లో ఆహార కల్తీపై హెచ్‌ఫాస్ట్ ఉక్కుపాదం మోపుతోంది. 100 రోజుల్లో 185 కల్తీ కేసులు నమోదు చేయడంతో పాటు 121 టన్నుల కల్తీ ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకుంది. అత్యధికంగా రాజేంద్రనగర్ జోన్‌లో 55 కేసులు నమోదయ్యాయి. హెచ్ ఫాస్ట్ పోలీసులు 100 రోజుల్లోనే 121.87 టన్నుల కల్తీ, ప్రమాదకరమైన ఆహారాన్ని స్వాధీనం చేసుకుని, 185 కేసులు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న వాటిలో 60 టన్నుల చికెన్ వ్యర్థాలు, నకిలీ అల్లంవెల్లుల్లి పేస్ట్, రసాయనాలతో పండించిన పండ్లు మరియు కల్తీ పాల ఉత్పత్తులు ఉన్నాయి. నగరవ్యాప్తంగా ఆహార కల్తీని అరికట్టడానికి మార్చి 19న హెచ్-ఫాస్ట్ విభాగాన్ని ఏర్పాటు చేశారు.

## సినీ నిర్మాత బండ్ల గణేష్‌కు చుక్కెదురు



**అక్షరటుడే, హైదరాబాద్:** సినీ నిర్మాత బండ్ల గణేష్‌కు తెలంగాణ హైకోర్టు షాక్ ఇచ్చింది. తనకు సంబంధించిన శ్రీ పరమేశ్వర పౌల్ట్రీ ఫాం ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పేరిట తీసుకున్న అప్పులు చెల్లించలేదు. దీంతో జూబ్లీహిల్స్‌లోని ఆస్తిని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.8.50 కోట్లకు వేలం వేసింది. వేలానికి వ్యతిరేకంగా బండ్ల గణేశ్ డెట్ రికవరీ ట్రిబ్యునల్‌కు వెళ్లగాఆయనకు అనుకూలంగా తీర్పు వచ్చింది. అయితే యూనియన్ బ్యాంక్ డెట్ రికవరీ ట్రిబ్యునల్ పై తీర్పుపై హైకోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం ఆ తీర్పును కొట్టేసింది. ఆస్తుల వేలం సరైన నిర్ణయం అని పేర్కొంది.

## తిరుపతిలో అన్నపాసన, అక్షరాభ్యాసం



**అక్షరటుడే, తిరుపతి :** తిరుపతిలో బాసర తరహా అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలకు టీటీడీ శ్రీకారం చుట్టింది. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో వకుళామాత ఆలయంలో ప్రవేశ పెట్టిన అక్షర గోవిందం అన్నప్రాశనం కార్యక్రమాన్ని టీటీడీ ఛైర్మన్ ప్రారంభించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసనం కోసం పలు ఆలయాలకు తీసుకు వెళ్తారు. నిర్మల్ జిల్లాలో గల బాసర సరస్వతి మాత ఆలయంలో ఏటా లక్షలాది మంది పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇదే తరహాలో తిరుపతిలో కూడా అక్షరాభ్యాసం, అన్నప్రాశన కార్యక్రమాలు చేపట్టాలని టీటీడీ నిర్ణయించింది. ఈ మేరకు వీటిని శుక్రవారం నుంచి ప్రారంభించింది. దీంతో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న భక్తులు తమ పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాశనం సైతం చేయించొచ్చు.